క్లుప్తంగా

పద్మశాలిగా స్పష్టంగా నమోదు చేయించాలి

శాయంపేట : కులజనగణన సర్వేలో పద్మశాలి కులాన్ని పద్మశాలీలు స్పష్టంగా నమోదు చేసుకోవాలని మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా కులజనగణన సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పద్మశాలీలందరూ ప్రొఫార్మలోని కాలం 7లో నేతకాని, శాల అని రాయించకుండా పద్మశాలి అని నమోదు చేయించాలని సూచించారు.

ధర్మయుద్ధాన్ని జయప్రదం చేయాలి

శాయంపేట : డిసెంబర్ 21 వ తేదీన నిర్వహించనున్న మాదిగ ధర్మయుద్ధం మహాసభకు మాదిగలు తరలిరావాలని మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ మంద రాజు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ముఖేష్ అధ్యక్షతన జరుగగా ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం గౌరవిస్తూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తూ ఏబీసీడీ వర్గీకరణ అమలు చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ ఇప్పటి వరకు వర్గీకరణ అంశంపై మాట్లాడడం లేదని తెలిపారు. హైదరాబాద్‌లో 20లక్షల మందితో ధర్మయుద్ధం మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల చేయూత

శాయంపేట : మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన బొట్ల మౌనిక తండ్రి మొగిలి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మౌనికతో పాటు 2009–10లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు. పూర్వ విద్యార్థులు సాగరిక, సుకన్య, అర్చన, కిశోర్, వినయ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్కతుర్తి : ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న సంఘటన మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ పాఠశాల సమీపం హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం అన్నసాగర్ గ్రామానికి చెందిన ఆల్లకొండ రాకేష్ ద్విచక్రవాహనంపై ఎల్కతుర్తికి వచ్చి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో కార్మెల్ కాన్వెంట్ సమీపంలోకి రాగానే లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని 108వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



దామెర : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి. పూజిత ఎంపికైనట్లు ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత రాజేష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఇటీవల హనుమకొండ జేఎన్ఎస్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ అండర్ 14 కబడ్డీ పోటీల్లో పూజిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పేర్కొన్నారు. నేటి నుంచి 9వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పూజితను, ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్‌ను ఎంఈఓ రాజేష్‌కుమార్, ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, శ్రీలత, రుక్మిణి దేవి, సుజన, రమేశ్‌రెడ్డి, సుదక్షణదేవి, మాధవి, రవీందర్, ఉమామహేశ్వర్, వెంకట్ రెడ్డి అభినందించారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కాపాడిన ఎస్సై

దామెర : హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేని 9వ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన దామెర మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మైనర్ విద్యార్థి ఫున్నేలు సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో దీపావళి సెలవుకు ఇంటికి వచ్చిన అతడు.. తిరిగి హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేదంటూ తల్లిదండ్రులతో చెప్పాడు. అనంతరం సెల్‌ఫోన్ తీసుకుని ఇంటి నుంచి పారిపోయి తాను గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని తండ్రికి వాట్సప్ ద్వారా ఫోటో పంపించాడు. దీంతో విద్యార్థి తండ్రి స్థానిక ఎస్సైకి విషయం తెలిపాడు. వెంటనే స్పందించిన ఎస్సై అశోక్ విద్యార్థి ఉన్న లోకేషను గుర్తించి సురక్షితంగా పట్టుకున్నాడు. కాగా సదరు విద్యార్థిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

కమలాపూర్ పెద్ద చెరువు బ్రిడ్జి సమీపంలో..



శనిగరం బ్రిడ్జిపై ఆరబోసిన ధాన్యం రాశులు



కమలాపూర్–ఉప్పల్ మధ్య రోడ్డుపై ఆరబోసిన ధాన్యం



వాహనదారులూ జాగ్రత్త..

- రోడ్లపై ఆరబోస్తున్న ధాన్యం
- గమనించకుంటే ప్రమాదాలే
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

కమలాపూర్ : వాహనదారులూ తస్మాత్ జాగ్రత్త..! ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా ప్రమాదాల బారిన పడి గాయాపడటమో లేక విగతజీవులుగా మారడమో ఖాయం. రైతులు పండించిన ధాన్యపు రాశులు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా రోడ్లన్నీ రైతులు ఆరబోసిన ధాన్యం రాశులతో నిండిపోయి కళ్లాలను తలపిస్తున్నాయి.

రెండేళ్ల క్రితం ఘోర ప్రమాదం..

రెండేళ్ల క్రితం శనిగరం శివారులో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కారణంగా ఐదుగురితో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టి అవతలి పక్కకు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతిచెందగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. దీంతో రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు పోలీసులు హెచ్చరిస్తున్నా రైతుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. కళ్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసుకోవాల్సిన రైతులు ఇందుకు విరుద్ధంగా ప్రధాన రహదారుల వెంట, వాగులపై నిర్మించిన వంతెనలపై ధాన్యం ఆరబోస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు జరుగకముందే రహదారుల వెంట ధాన్యం ఆరబోయకుండా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. గ్రామాల్లో అవగాహన సదస్సులో ఏర్పాటు చేసి అర్థమయ్యే విధంగా చెప్పాలని అంటున్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



పంట ఉత్పత్తులను కళ్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసుకోవాలి. రహదారుల వెంట ఆరబోయవద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రహదారి వెంట ధాన్యం ఆరబోసిన కారణంగా రెండేళ్ల క్రితం శనిగరం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ముగ్గురు మృతి చెందారు. ఇలాంటి దుర్ఘటన మరలా జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. రైతులు కూడా ప్రమాదాల నివారణకు కృషి చేయాలి. లేదంటే కేసులు నమోదు చేస్తాం. అతివేగంగా, అజాగ్రత్తగా వెళ్లకుండా వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించాలి. అతివేగంగా వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవద్దు.

– హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్

వీరభద్రుడి ఆలయ హుండీ లెక్కింపు

- ఆదాయం రూ.5,38,215



ఎల్కతుర్తి : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి హుండీ లెక్కింపు దేవాదాయ, ధర్మదాయ శాఖ వరంగల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఆలయ ఈఓ కిషన్‌రావు సమక్షంలో చేపట్టారు. మొత్తం ఆదాయం రూ.5,38,215 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో నోట్లు రూ.5,05,083 కాగా నాణెములు రూ.33,132, విదేశీ కరెన్సీ నోట్లు, 113 గ్రాముల మిశ్రమ బంగారం, 14కేజీల వెండి కానుకల రూపంలో వచ్చినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు. పిడిశెట్టి కనుకయ్య, పూదర రవీందర్‌గౌడ్, లక్ష్మణ్‌నాయక్, రామచంద్రం, మాడిశెట్టి కుమారస్వామి, సర్వస్వతి సేవా సమితి సభ్యులు వెంకన్న పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వెంటనే తెరిపించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని తెరిపించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి కిశోర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు తాటికాయల కుమార్ మాట్లాడుతూ.. మండల మహిళ సమాఖ్య భవనంలో గ్రంథాలయం కొనసాగేదని, దానిని మూసివేశారని తెలిపారు. గ్రంథాలయం నిరుద్యోగ యువకులకు ఉపయోగకరంగా ఉండేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందించినవారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌గౌడ్, కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోర్ బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ యూత్ నాయకులు

శాయంపేట : మండలంలోని మాందారిపేట గుట్టల్లో పరిమితికి మించి చేపడుతున్న బోర్‌బ్లాస్టింగ్‌లను నిలిపివేయాలని కాంగ్రెస్ యూత్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు బడుగు అశోక్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. మాందారిపేట శివారులో గల క్రషర్ యజమానులు అనేక సంవత్సరాల నుంచి గుట్టల్లో బోర్‌బ్లాస్టింగ్‌లు చేపడుతున్నారని, సమీపంలోని ఇళ్లు, దేవాలయాలు, వాటర్ ట్యాంక్‌లు పగుళ్ల బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిన్నా రాజేందర్, మాజీ ఎంపీటీసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో సమస్యలు



సదస్సులో మాట్లాడుతున్న రాంచందర్

మడికొండ : పొగాకు వాడకం ద్వారా అనేక సమస్యలు వస్తాయని హెల్త్ సూపర్‌వైజర్ రాంచందర్ హెచ్చరించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి ఉమమహేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రామచందర్ మాట్లాడారు. విద్యాసంస్థలు పొగాకు రహిత విద్యాసంస్థలుగా ఉండాలని, పొగాకు రహిత యువతగా మార్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. మానవ శరీరం నికోటిన్‌కు అలవాటు పడి, తర్వాత వ్యసనానికి గురై జీవితంలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయని వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ అహ్మద్, సోషల్ వర్కర్ ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ.రావు ఆశయాలు కొనసాగిద్దాం



కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న నెక్ సభ్యులు

కాజీపేట అర్బన్: పౌల్ట్రీరంగ పితామహుడు డాక్టర్ బీవీ.రావు ఆశయాలను కొనసాగిద్దామని నెక్ వరంగల్ లోకల్ కమిటీ చైర్మన్ ఆవుల చంద్రయ్య అన్నారు. హంటర్‌రోడ్డులోని నెక్ కార్యాలయంలో బీవీ.రావు 89వ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈమేరకు బీవీ.రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కోళ్ల రంగంలో ప్రథమ స్థానంలో నిలపాలనే బీవీ.రావు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. నెక్ వరంగల్ జోనల్, టీపీఎఫ్ సభ్యుడు త్రిపురనేని సుబ్రహ్మణ్యం, టీపీఎఫ్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు వెనెపల్లి రామారావు, పునాటి హరిబాబు, డబ్ల్యూపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్యాంసుందర్, కోశాధికారి మార్త రాంప్రసాద్, రాంచందర్, వీరన్న, కరుణాకర్‌రెడ్డి, రమణారెడ్డి, గాదె రాజేందర్, గాంధీ, ప్రతాప్‌రెడ్డి, పాషా, ధనుంజయ్, రాజేశ్వర్‌రావు, వినయ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విద్యా విధానానికి పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారావు

విద్యారణ్యపురి: శాస్త్రీయ విద్యావిధానం, సమానత్వపు సమాజ స్థాపనే ధ్యేయంగా పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ హనుమకొండ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ కమిటీ ఆధ్వర్యంలో విప్లవ విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతంలో పాలకులు ఉచిత నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఆలువాల నరేష్, వినయ్, బాలు, హర్ష, వంశీ, శివాజీ, కార్తీక్, మనోహర్, రాఘవ, రాజేష్, ప్రకాశ్, వినయ్, అజయ్, సాహితీ, చందన తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ చరిత్ర తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలి

కాశిబుగ్గ: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లలోకి అడుగుపెడుతున్న వేళ వాడవాడలో ఎర్ర జెండాలు ఎగురవేసి, పార్టీ చరిత్ర తెలిసేలా కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దోపిడీ పాలక వర్గాలు అవలంబించే విధానాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన సీపీఐ నిలబడి వందేళ్లుగా పోరాటం చేస్తోందని వివరించారు. దున్నేవాడికే భూమి కావాలని భూసంస్కరణలు వచ్చే విధంగా అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలు చేసి లక్షల ఎకరాలను పేదలకు పంచిందని గుర్తుచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో పోరాడినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి బుస్స రవీందర్, నాయకులు గన్నారపు రమేష్, మేడిద అశోక్, పంజాల రమేష్ పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కమలాపూర్ : మండలంలోని అంబాలకు చెందిన దేశిని రాజయ్య, అతని కుమారులు దేశిని తిరుపతి, దేశిని శ్రీకాంత్, కంఠాత్మకూర్‌కు చెందిన గుర్రం రాజేష్ అనే నలుగురితో పాటు మరికొందరిపై బుధవారం రెండు వేర్వేరు దాడి కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న దేశిని రాజయ్య తన ఇంటి నిర్మాణ పనుల కోసం ట్రాక్టర్ తీసుకుని అంబాల వాగు వద్దకు వెళ్లాడు. అక్కడ అంబాలకు చెందిన బోయిని శ్రావణ్ రాజయ్య ట్రాక్టర్ తాళం తీసుకుని అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారని వాదిస్తూ గ్రామపంచాయతీ వద్దకు ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. దీంతో రాజయ్య, శ్రావణ్ మధ్య వాగ్వివాదం జరిగింది. అదే రోజు సాయంత్రం రాజయ్యతో పాటు తిరుపతి, శ్రీకాంత్, రాజేష్ తదితరులు అంబాల బ్రిడ్జి వద్ద ఉన్న శ్రావణ్‌ను అడ్డుకుని బెదిరింపులకు పాల్పడి కర్రలతో దాడి చేశారు. శ్రావణ్‌పై దాడి చేయడానికి ముందు రాజయ్య, తిరుపతి, శ్రీకాంత్, రాజేష్‌తో పాటు మరికొందరు కలిసి అంబాలకు చెందిన బోయిని శ్రీకాంత్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి శ్రావణ్‌కు సపోర్ట్ చేస్తున్నావంటూ శ్రీకాంత్‌పై కర్రలతో దాడికి పాల్పడ్డారు. శ్రావణ్ తల్లి వనమ్మ, బోయిని శ్రీకాంత్ ఫిర్యాదుల మేరకు రాజయ్య, తిరుపతి, శ్రీకాంత్, రాజేష్‌తో పాటు మరికొందరిపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేయర్‌ను కలిసిన సెక్రటరీ

వరంగల్ అర్బన్: నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా సెక్రటరీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సెక్రటరీ లక్క అలువేలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మేయర్‌కు పూల మొక్క అందజేశారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సదయ్య

వేలేరు : ఉపాధ్యాయుల అక్రమ డిప్యుటేషన్లను వెంటనే రద్దు చేయాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు గంటే సదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులను మండలంలో సర్దుబాటు చేసిన తరువాత ఇతర మండలాలకు సర్దుబాటు చేయాల్సి ఉంటుందని, కానీ కొంతమంది ఉపాధ్యాయులు వారి స్వలాభం కోసం అధికారుల అండదండలతో హనుమకొండలో డిప్యుటేషన్ పొందడం సరికాదని అన్నారు. అక్రమంగా పొందిన డిప్యుటేషన్లను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి భూక్య హరిలాల్, వెంకటస్వామి, అబ్దుల్ సత్తార్, సదానందం, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్సై పస్తం శ్రీనివాస్

ఐనవోలు : బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని ఎస్సై పస్తం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో బాలికా సాధికారిత క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై హాజరై మాట్లాడారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు సోషల్ మీడియాకు అడిక్ట్ కావొద్దని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వలన అపరిచితులతో పరిచయాలు ఏర్పడుతాయని, వారి మాయమాటలతో మోసపోయే ప్రమాదం ఉంటుందన్నారు. చట్టాలను బాలికలు, మహిళలు ధైర్యంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల మాట్లాడుతూ... ఈ క్లబ్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతీ తరగతి నుంచి ఇద్దరు బాలికలు, ఒక ఫ్రెండ్లీ టీచర్ ఉండనున్నట్లు తెలిపారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100 గురించి వివరించారు. ఇన్‌చార్జ్ ఎస్ఓ సత్యవాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ కోసమే కులగణన



శాయంపేట : డోర్‌కు స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



పరకాల : మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అనిత



ధర్మసాగర్ : సర్వేను పర్యవేక్షిస్తున్న జెడ్పీ సీఈఓ

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని నెరవేర్చేందుకే కులగణన చేపట్టినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన కులజనగణన ఇంటింటి సర్వే స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో ఏ పార్టీ చేయని సాహసం కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. బీసీ డిక్లరేషన్ హామీ అమలు కోసం కులగణన చేపడుతుందని అన్నారు. మండలంలో 12,611 ఇళ్లను సర్వే చేసేందుకు 95 మంది ఎన్యుమరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధికారులకు సహకరించాలని సూచించారు. బీసీలకే కాకుండా సబ్బండ వర్గాలకు కూడా సర్వేలో 75 అంశాలు రూపొందించినట్లు చెప్పారు. సర్వే ఆధారంగా రిజర్వేషన్లు వస్తాయన్నారు. ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. ప్రతిపక్షాల మాటలను పట్టించుకోవద్దని ప్రజలను కోరారు. బీసీ వెల్ఫేర్ అధికారి జయంతి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, సీడీపీఓ స్వాతి, సూపర్‌వైజర్ సునీత, మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, నాయకులు పాల్గొన్నారు.

పరకాల : మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పసుల లావణ్య అధ్యక్షతన ఇంటింటి సర్వేపై సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే దోహదపడుతుందన్నారు. ఇన్‌చార్జ్ కమిషనర్ సుష్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్ రెడ్డి, కౌన్సిలర్స్ సంపత్, మొగిళి, రాజు, మున్సిపల్ ఏఈ రంజిత్, ఆర్వో రఘు, టీపీఎస్ ఖురేషి, డిప్యూటీ స్టాటస్టికల్ అధికారి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు అనిల్, రమేశ్, రఘుపతి పాల్గొన్నారు.

దామెర: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల వ్యాప్తంగా బుధవారం కుటుంబ సర్వే ప్రారంభించారు. అధికారులు ఇటింటికెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకొని, స్టిక్కరింగ్ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. 14 గ్రామాలకు 68 మంది ఎన్యుమరేటర్లను నియమించామని, ఏడుగురు మండస్థాయి అధికారులు సర్వేను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐనవోలు : మండల వ్యాప్తంగా 112 మంది ఎన్యుమరేటర్లు, 12 మంది సూపర్‌వైజర్‌లు సర్వేలో విధులు నిర్వర్తిస్తున్నట్లు ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 16 వేల కుటుంబాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి స్టిక్కర్లు వేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, అంగన్‌వాడీలు, ఎస్జీటీలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : మండల వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే బుధవారం ప్రారంభమైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికెళ్లి వివరాలు సేకరించి స్టిక్కర్లు వేశారు. మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను జెడ్పీసీఈఓ విద్యాలత పర్యవేక్షించారు. అనంతరం ఆయా గ్రామాల్లో డీఆర్డీఓ నాగపద్మజతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీఓ అఫ్జల్, ఏపీఓ సంపత్, ఏపీఎం అనిత, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వస్తేనే పరిసరాలు క్లీన్



రోడ్డుకిరువైపులా పరిసరాలను శుభ్రపరుస్తున్న మల్టీపర్పస్ సిబ్బంది

శాయంపేట : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో కులగణన సర్వే ప్రారంభ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన సందర్శించే ప్రదేశంలో గల రోడ్లకిరువైపులా పరిసరాలను గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది శుభ్రం చేశారు. అయితే ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యటన ఉంటనే పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారనే తప్పా మిగతా రోజుల్లో చెత్తాచెదారాన్ని తొలగించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.